# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

## రేడియో శ్రీలంక ద్వారా క్రీస్తు సంఘముల సువార్త ప్రసారములు

తెలుగు — SATYA VANI

ప్రతి ఆది, మంగళ, గురు, శుక్ర, శనివారాల్లో
మధ్యాహ్నం 2-30 ని॥లకు

ఇంగ్లీషు — THE VOICE OF TRUTH

| | |
|---|---|
| సోమవారము | 9-00 to 9-15 p.m. |
| బుధవారము | 9-30 to 9-45 a.m. |

హిందీ — SATYA SUSAMACHAR

| | |
|---|---|
| మంగళవారము<br>గురువారము<br>శుక్రవారము | 9-00 to 9-15 p.m. |
| ఆదివారము | 1-30 to 1-45 p.m. |

తమిళం — SATYA VAZHI

| | |
|---|---|
| మంగళవారము | 5-30 to 5-45 p.m. |
| గురువారము<br>శుక్రవారము | 6-45 to 7-00 p.m. |

మళయాళం — THE VOICE OF TRUTH

| | |
|---|---|
| మంగళవారము<br>శుక్రవారము | 3-45 to 4-00 p.m. |

ఈ కార్యక్రమములను అందరు వినండి. అందరికి విన్పించండి.
తెలుగు, ఇంగ్లీషు భాషలలో లభ్యమగు ఉచిత బైబిలు కరస్పాండెన్సు కోర్సులలో చేరి ఒక క్రొత్త నిబంధనను ఉచితంగా పొందండి. ఈ రోజే మాకు వ్రాయండి :

SATYA VANI
P.O. Box 80
KAKINADA – 533 001

రాజ్ ఎలక్ట్రిక్ ప్రెస్, కాకినాడ.

# సత్యవాక్కు

క్రైస్తవ మాసపత్రిక

పోస్టు బాక్సు - **80,** కాకినాడ - **533 001**

ఎడిటర్ : మేనేజింగ్ ఎడిటర్ :

జె. పి. ఫోట్ జాషువా గూటం

సంచిక **6** జనవరి **1986** సంపుటి **6**

## సంపాదకీయము

### "నేనాయన వస్త్రపు చెంగు ముట్టిన చాలును"

### *(If I Can But Touch the Hem of His Garment)*

యేసుప్రభువు ఈ భూమిమీద ఉన్నప్పుడు అనేక రోగులను బాగుచేసాడు. ఆయన ఒక ఊరునుండి మరొక ఊరుకు, పట్టణము నుండి పట్టణానికి పయనించేవాడు. ఆయన పనివలన ఆయన ప్రఖ్యాతి దేశమంతా వ్యాపించింది. ఆయన వారిని బాగుచేయునట్లు అనేక మంది ఆయన చెంతకు చేరడానికి ప్రయత్నించేవారు. కొంత మంది ఎంత బలంగా నమ్మేవారంటే, వారాయన వస్త్రపు చెంగు ముట్టిన చాలును, మేము బాగుపడుదుమని భావించేవారు. ఇట్టి సందర్భ మొకటి మత్తయి 9:20-22లో మనం చూడగలము : "ఆ సమయమున, ఇదిగో పండ్రెండు సంవత్సరములనుండి రక్తస్రావ రోగముగల యొక స్త్రీ - నేను ఆయన పై వస్త్రము మాత్రము ముట్టితే బాగు పడుదునని తనలో తాను అనుకొని, వెనుకకు వచ్చి ఆయన వస్త్రపు చెంగు ముట్టెను. యేసు వెనుకకు తిరిగి ఆమెను చూచి - కుమారీ ధైర్యముగా ఉండుము, నీ విశ్వాసము నిన్ను బాగుపరచెనని చెప్పగా ఆ ఘడియనుండి ఆమె బాగుపడెను".

మరొక సందర్భములో యేసు, ఆయన శిష్యులు గెన్నేసెరెతు దేశమునకు వచ్చినప్పుడు "అక్కడి ప్రజలు ఆయనను గుర్తుపట్టి చుట్టు పట్లనున్న ఆ ప్రదేశ మంతటికి వర్తమానము పంపి, రోగుల నందరిని ఆయన యొద్దకు తెప్పించి, వీరిని నీ వస్త్రపు చెంగు మాత్రము ముట్ట నిమ్మని ఆయనను వేడుకొనిరి; ముట్టిన వారందరును స్వస్థత నొందిరి" (మత్తయి 14:34-36).

యేసు వస్త్రపు చెంగు ముట్టాలని అనుకొన్న స్త్రీ అనేక వైద్యుల యొద్దకు వెళ్ళి తనకు కలిగినదంతయు వ్యర్థము చేసికొని ఏమియు ప్రయోజనము లేక మరింత సంకట పడెనని మార్కు వ్రాసాడు. "ఆమె యేసునుగూర్చి విని - నేను ఆయన వస్త్రములు మాత్రము ముట్టిన బాగుపడుదుననుకొని జనసమూహములో ఆయన వెనుకకు వచ్చి ఆయన వస్త్రము ముట్టెను. వెంటనే ఆమె రక్తధార కట్టెను గనుక తన శరీరములోని బాధ నివారణమైనదని గ్రహించుకొనెను" (మార్కు 5:27-29).

ఈ స్త్రీయు, ఈమెవలె ఆయన వస్త్రపు చెంగు మాత్రము ముట్ట నాశించినవారును, వారిని స్వస్థపరచే ఆయన శక్తియందు గొప్ప విశ్వాసము కలిగియుండిరి. తత్ఫలితముగా వారు స్వస్థత నొందిరి. అయితే ఈ స్త్రీని గూర్చి ఒక్క క్షణం ఆలోచించు. ఆమె ఏ వస్త్రాన్నయినా, ఎవరి వస్త్రాన్నయినా ముట్టుకొన యత్నించలేదు. ఆమె విశ్వాసము యేసుక్రీస్తునం దుండెను. ఆమెకు ఎంత విశ్వాస ముండెనంటే ఆయన వస్త్రపు చెంగు ముట్టితే చాలు నేను బాగై పోవుదునని ఆలోచించింది. ఆ పని జరగడానికి అవుసరమైన ప్రయత్నాన్ని కృషిని ఆమె చేసింది. యేసు చుట్టు జనసమూహములున్నను, ఆమె రోగియై యున్నను, ఆయన దగ్గరికి చేరడానికి కష్టమైనను ఆయన వస్త్రాన్ని ముట్టుకొనడానికి ఆమె నిశ్చయించుకొని ఆ పని సాధించి సఫల

మయ్యింది. ఆమె మన స్తత్వము, విశ్వాసము నిశ్చయత ప్రయత్న ములవలన ఆమె ఫలితాన్ని పొందింది.

ఆమెవంటి మన స్తత్వము విశ్వాసము కలిగి ప్రభువుకు విధేయులగుటకు అవసరమైనదంతా చేసి ఆయనకు సేవచేయ నిష్టపడువారు ఈనాడు పెక్కుమంది యుంటే చాల బాగుండును. నా మిత్రులారా, ఆత్మీయ విషయాల్లో సత్యానికి తక్కువైన దానిని దేనిని మనం అంగీకరించకూడదు. సత్యము దేవుని యొద్దనుండి కలిగినది. మనలను రక్షించి స్వతంత్రులను చేయునది సత్యమే (యోహా 17 : 17; 8:32). అయితే దేనిని బడితే దానిని అంగీకరించే వారు చాలమంది యున్నట్టున్నారు. అయితే అనేక అబద్ధప్రవక్తలు లోకములోనికి బయలువెళ్లి యున్నారని యోహాను చెప్పిన దానిని మనం జ్ఞాపకముంచుకోవాలి (I యోహాను 4:1).

మనం దేవుని మార్గముతో తప్ప మరియే మతము (మార్గము) తోనైనను సంతృప్తి జెందరాదు. లోకంలో అనేక మతాలున్నాయి గాని, దేవుని దైనది ఒకే ఒక్కటియున్నది (యాకోబు 1 : 26). మానవ కల్పిత మతాలు కలుషితములుగాని దేవునిది నిష్కల్మషము (యాకో 1 : 27).

## క్రీస్తు సువార్త చాలు

క్రీస్తు సువార్తను వినివిధేయత చూపిన చాలును, మనం రక్షింపబడుదుమనే మన స్తత్వము మనదవ్వాలి. ఈ సువార్త అందరికీ బోధింపబడాలని, "నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడునని" క్రీస్తు చెప్పాడు (మార్కు 16:15, 16). మానవ కల్పిత సువార్తలు, తెరుపబడిన సువార్తలు, అబద్ధ సువార్తలు మొదలగునవి అనేకములున్నాయిగాని అవి రక్షించవు. అవి వినసొంపుగానే యుంటాయిగాని చివరకు నాశనం చేస్తాయి (గలతీ 1 : 6-9). అయితే క్రీస్తుయొక్క

సత్యసువార్తను మనం ఎక్కడ కనుగొంటాము? దేవుని గ్రంథములో కనుగొంటాము. అందరు ఒకే సువార్తను విని, విశ్వసించి విధేయత చూపితే అందరు ఒకే సంఘసభ్యులౌతారు, అయితే ఈనాడు వివిధ సంఘాలు, సభ్యులు ఉన్నారంటే ఎక్కడో, ఎవరో పౌలు ప్రకటించిన సువార్తగాక వేరొక సువార్తను ప్రకటించుచున్నారని యర్థం. దేవుని గ్రంథములో యున్నదానిని తప్ప వేరొక దానిని మనం అంగీకరించ కూడదు. అప్పుడు మాత్రమే మనము రక్షించబడుదుము.

## క్రీస్తు సంఘము చాలు

సంఘము విషయము కూడ అట్లే, క్రీస్తుసంఘములో తప్ప వేరొక దానిలో యుండుటకు మనము ఇష్టపడరాదు. బైబిలులో మనం ఒకే ఒక్క సంఘాన్ని గూర్చి చదువుతాము. మానవ కల్పితమై క్రీస్తుకు చెందకుండా, ఆయన నామము ధరించకుండా యున్న సంఘములో ఎందుకుండాలి?

క్రీస్తు తన సంఘాన్ని స్థాపించాడు (మత్త 16:18). అది క్రీ॥ శ॥ 33వ సంవత్సరములో పెంతెకొస్తునాడు యెరూషలేములో ఆరంభించబడింది (అపో. కా. 2). క్రీస్తు దానికొరకు చనిపోయి తన రక్తాన్ని చిందించాడు (అపో. కా. 20:28; ఎఫె 5:27). ఆయన దాని రక్షకుడు (ఎఫె 5: 23), దాని శిరస్సు (కొల 1:18); అది ఆయన నామమును ధరించును ( I కొరింధీ 12:27; రోమా 16 : 16).

సంఘము అంతప్రాముఖ్యముకాదు, నీవే సంఘములో యున్నా పరవాలేదు, అన్నీ ప్రభువు సంఘాలుకాదా యని చెప్పే ప్రజలనేకులున్నారు; గాని నీవు వారి మాటలను నమ్మనక్కర్లేదు. రక్తస్రావము గల స్త్రీ ఎవరి చెంగు ముట్టుకొన్నా పరవాలేదు, అందరి వస్త్రాలు ఒకటే కాదా యని అనుకొంటే ఏలాగుండును? ఆమె రోగము బాగు పడునా? కానేకాదు! ఆమె బాగుపడాలంటే క్రీస్తు వస్త్రపు చెంగును ముట్టవలసి యున్నది. దానిని ముట్టగానే ఆమె బాగుపడింది. సంఘము

విషయములో కూడ అట్లే. క్రీస్తు తన సంఘానికి రక్షకుడు. మనం రక్షింపబడాలంటే ఆయన సంఘములో సభ్యులై యుండాలి. ఆయనకు ఒకే ఒక్క సంఘమున్నది (ఎఫె 4:4).

క్రీస్తును వెంబడించే వ్యక్తిగాను ఆయన సంఘ సభ్యునిగాను ఆయన నామము ధరించుకొనుటకు మనం నిశ్చయించుకోవాలి. అందరి నామములలోగాక క్రీస్తు నామములోనే రక్షణ యున్నదని చెప్పబడినది (అపొ. కా: 4:12). మన మేది చేసినా ఆయన నామమును బట్టి చేయాలి (కొల 3:17). సంఘము క్రీస్తు నామమును ధరించకపోతే మరింకెవరి నామాన్ని ధరిస్తాది ? మిగతా విషయాలలో వలెనే నామము అంత ముఖ్యముకాదని, ఏ పేరుతో పిలువబడినా పరవాలేదని కొందరు చెబుతారు, అయితే లేఖనములట్లు బోధించుట లేదు. క్రీస్తునామమును గూర్చి సంఘనామమును గూర్చి, సభ్యుల నామమును గూర్చి బైబిలు ఏమి చెప్పుచున్నదో చూడుము.

## సత్యారాధన చాలు

ఆరాధన విషయంలో కూడ ప్రభువు తన వాక్యములో ఎట్లు నిర్దేశించాడో అట్లే చేయడానికి మనము నిశ్చయించుకోవాలి. మనం ఏ విధంగా ఆరాధించినా పరవాలేదని చెప్పేవారున్నారు. అయితే మనుష్యులు కల్పించిన పద్ధతులనుబట్టి ఆరాధిస్తే మన ఆరాధన వ్యర్థమని మనకు చెప్పబడింది (మార్కు 7:7). మన ఆరాధన ఆత్మతోను సత్యముతోను ఉండాలని క్రీస్తు చెప్పాడు (యోహాను 4 : 24). మన ఆరాధన అంగీకరించబడాలంటే ప్రభువుకోరు కొన్ని ప్రత్యేక సంగతులు చేయాలని క్రొత్త నిబంధన బోధించుచున్నది.

మనం ఆదివారమున ఆరాధనకు కూడుకొనాలి (అపొ. కా. 20:7). ఆరాధనలో దేవుని వాక్యపఠనం జరగాలి (2 తిమో 2:15), ప్రార్థించాలి (అపొ. కా. 2:42), ప్రభువుకు స్తోత్రగానములు పాడాలి

(ఎఫెసీ 5 : 19), ప్రభు రాత్రి భోజనములో పాల్గొనాలి ( I కొరింథీ 11 : 23-29), కానుక లియ్యాలి ( I కొరి 16 : 2); మరియు మనము సమాజముగా కూడుట మానరాదు (హెబ్రీ 10 : 25). మనం ఆరాధింపగోరితే ప్రభువు చెప్పిన రీతిగనే ఆరాధించాలి.

ఆత్మీయ విషయాల్లో మనం యేమి చేసినా, ప్రభువు తన వాక్యములో బయలుపరచిన రీతిగనే చేయాలి. దేవుని చిత్తానికి భిన్నముగను మనుష్యుల చిత్తానికి అనుగుణ్యముగను యున్న వాటిని చేస్తూ జీవితాన్ని గడిపేస్తే ఫలితం శూన్యం. ప్రభువు వాక్యముండగా మనుష్యుల బోధల నెందుకు గైకొనాలి? మన జీవితాలు సంకుచితం, నిత్యత్వం అనంతం. ప్రభువు మార్గమే సరియైనది (మత్త 7 : 21). క్రీస్తు ద్వారా తప్ప తండ్రియొద్దకు వేరేమార్గము లేదు (యోహాను 14:6). సత్య మార్గములో పయనించుటకు మనందరం నిశ్చయించుకొందుముగాక !

---

## లేఖనముల యొక్క సంపూర్ణత

"స్వాతంత్ర్యము నిచ్చు సంపూర్ణమైన నియమములో తేరి చూచి నిలకడగా ఉండు వాడెవడో వాడు విని మరచు వాడుకాక క్రియను చేయువాడై యుండి తన క్రియలో ధన్యుడగును" యాకోబు 1:25. బైబిలు గ్రంథము దేవుని పరిపూర్ణమైన బయలుపాటు. అపొస్తలులు సర్వసత్యములోనికి నడిపింపబడుటకు క్రీస్తు ప్రభువు పరిశుద్ధాత్మను పంపుదునని వాగ్దానము చేసెను. "ఆదరణకర్త, అనగా తండ్రి నా నామమున పంపబోవు పరిశుద్ధాత్మ సమస్తమును మీకు బోధించి నేను మీతో చెప్పిన సంగతులన్నిటిని మీకు జ్ఞాపకము చేయును" యోహాను 15:26. పరిశుద్ధాత్మ అపొస్తలులను సర్వసత్యములోనికి నడిపించి మానవునికి కావలసిన లేదా అవసరమైన సంగతులన్నిటిని వారికి

వ్రాయించెను. పరిశుద్ధాత్ముడు చేసిన ఈ కార్యము సంపూర్ణమైనది. మానవునికి కావలసిన రక్షణ మార్గము, ఆరాధించు విధానము, క్రైస్తవ జీవితమునకు కావలసిన హెచ్చరికలు లేఖనముల యందు భద్రపరచబడినవి.

"లేఖనముల యందు మీకు నిత్యజీవము కలదని తలంచుచు వాటిని పరిశోధించుచున్నారు. అవే నన్ను గూర్చి సాక్ష్యమిచ్చుచున్నవి" యోహా 5:39. "అందుచేత సమస్త కల్మషమును విస్తరించుచున్న దుష్టత్వమును మాని లోపల నాటబడి మీ ఆత్మలను రక్షించుటకు శక్తిగల వాక్యమును సాత్వికముతో అంగీకరించుడి" యాకోబు 1:21. లేఖనములు అనగా లిఖించబడినవి లేదా వ్రాయబడినవి అని అర్థము. లేఖనములనగా దేవుని వాక్యము. ఇవి దైవావేశము వలన కలిగిన లేఖనములు. లేఖనములయందు నిత్యజీవము, ఆత్మలను రక్షించు శక్తి ఉన్నవి.

లేఖనములయందు యింతటి శక్తిని ఉంచిన మన దేవుడు సర్వశక్తిమంతుడు. "లేఖనములయందు వ్రాసియున్న సంగతులు అతిక్రమింపకూడదని" 1 కొరింధి 4:6లో పౌలు చెప్పెను. బెరయలో ఉన్న క్రైస్తవులు జ్ఞానులైనందున "పౌలును సీలయును చెప్పిన సంగతులు ఆలాగున్నవో లేవో అని ప్రతిదినము లేఖనములు పరిశోధించుచు వచ్చిరి" అ.కా. 17:11. లేఖనములు పరిశోధించుట వలన మనము లేఖనములయొక్క పరిపూర్ణతను గమనించగలము.

సంపూర్ణమైన దేవుని చిత్తము మనకు దేవుడిచ్చి యుండగా అనేకులు దేవుని బయలుపాటు కొరకు ఈనాడు కనిపెట్టుచున్నారు. దేవుడు దర్శనములో నాకీ సంగతులు బయలుపరచెనని చెప్పు మనుష్యులు ఈనాడు ఎంతోమంది ఉన్నారు.

వీరు లేఖనములను ఎరుగనివారు. "మేము మీకు ప్రకటించిన సువార్తగాక మరియొక సువార్తను మేమైనను పరలోకము నుండి వచ్చిన యొక దూతయైనను మీకు ప్రకటించిన యెడల అతడు శాపగ్రస్తుడవునుగాక" గలతి 1:9. ఈ వాక్యభాగము మరొకసారి దేవుని బయలుపాటు కొరకు కనిపెట్టువారిని తీవ్ర పదజాలముతో ఖండించుచున్నది. మరొకసారి దేవుని సంకల్పము కొరకు కనిపెట్టుట లేఖనములను అలక్ష్యము చేయుటయే. ఈనాడు దేవుడు తన చిత్తమును దర్శనముల ద్వారా తెలియజేయుచున్న యెడల దేవుని వాక్యము లేదా బైబిలు గ్రంథము నిష్ప్రయోజనము.

లేఖనములను పరిశోధించి లేఖనములద్వారా దేవుడు మానవుని కిచ్చిన గొప్ప ఆజ్ఞలను వాగ్దానములను తెలిసికొని విధేయులై రక్షణ పొందుము.

— E.K.V. ప్రసాదరావు, చెయ్యేరు

---

## క్రైస్తవ శిష్యత్వము
## ( Christian Discipleship )
( గత సంచిక తరువాయి )

### శిష్యత్వము యొక్క మూల్యము
### ( The cost of Discipleship )

"యేసు తన శిష్యులను చూచి - ఎవడైనను నన్ను వెంబడింప గోరిన యెడల, తన్నుతాను ఉపేక్షించుకొని తన సిలువ నెత్తుకొని నన్ను వెంబడింపవలెను" అని చెప్పాడు (మత్తయి 16 : 24). క్రైస్తవ శిష్యుడైన వాడు

1. తన్నుతాను ఉపేక్షించు కొనాలి.
2. తన సిలువ నెత్తుకొని ఆయనను వెంబడించాలి.

**తన్నుతాను ఉపేక్షించుకొనుట (Self Denial) :** క్రీస్తును వెంబడించు వాడు తన పాతబ్రతుకును, సంబంధములను, ఆశలను విసర్జించాలి. స్వార్థాన్ని మరచి పోవాలి. పాపజీవితాన్ని పూర్తిగా విసర్జించాలి, (రోమా 6:12, 13; యాకోబు 1:21; 1 పేతురు 2:11; ఎఫెసీ 4:25-29; 1 కొరింథి 3:16-17; 6:19-20).

నీవు వెళ్ళి నీకు కలిగినవన్నియు అమ్మి బీదలకిమ్ము; పరలోకమందు నీకు ధనము కలుగును. నీవు వచ్చి నన్ను వెంబడించుమని ధనవంతుడైన యౌవనవస్థునితో యేసు చెప్పాడు (మార్కు 10:21).

"ఎవడైనను నా యొద్దకు వచ్చి తన తండ్రిని తల్లిని భార్యను పిల్లలను అన్నదమ్ములను అక్కచెల్లెండ్రను తన ప్రాణమును సహా ద్వేషింపకుంటె వాడు నా శిష్యుడు కానేరడు. మరియు ఎవడైనను తన సిలువను మోసికొని నన్ను వెంబడింపని యెడల వాడు నా శిష్యుడు కానేరడని" ఆయన చెప్పాడు (లూకా 14:25-27).

ఇకను జీవించువాడను నేను కాను, క్రీస్తే నా యందు జీవించుచున్నాడని పౌలు చెప్పాడు (గలతి 2:20). మనలో ఉన్న 'నేను' అనే పాత పురుషుడు బాప్తిస్మమందు క్రీస్తుతో కూడ పాతిపెట్టబడాలి. నూతన పురుషుడు తిరిగి లేపబడాలి. పేతురు, మిగిలిన అపొస్తలులు సమస్తమును విడిచిపెట్టి ఆయనను వెంబడించారు (మార్కు 10:28).

**సిలువ నెత్తికొని వెంబడించుట :** క్రీస్తు సిలువ అనేక హింసలకు, శోధనలకు బాధలకు గురుతు. "మనుష్యకుమారుడు అనేక హింసలు పొంది, పెద్దలచేతను ప్రధాన యాజకుల చేతను శాస్త్రుల చేతను ఉపేక్షింపబడి చంపబడి, మూడుదినములైన తరువాత లేచుట అగత్యమని" యేసు తన శిష్యులకు బోధించాడు (మార్కు 8:31).

దేవుడు తనకుమారుని మనకై అప్పగించాడు. **It cost God the life of His son** (యోహాను 3:16). ఆయన మన శరీరాన్ని దాల్చి పాపములకై మనకు రావలసిన శిక్షను తన సిలువలో భరించాడు (హెబ్రీ 9 : 15-17; 10 : 9-14; 10 : 4; యోహాను 10 : 10; 1 పేతురు 2:21-22; యోహాను 12:32).

ఆయన మనకొరకు అప్పగింపబడ్డాడు; నాకొరకు తన ప్రాణము పెట్టాడు గనుక నేను క్రీస్తుకొరకు ప్రాణముపెట్ట బద్ధుడనై యున్నాను. ఒకడు క్రైస్తవుడుకాగానే ఈలోక భాగ్యము కాదుగాని అతనికొరకు సిలువను మోయుట ఏర్పాటు చేయబడింది. ఆయన శ్రమలలో పాలి భాగస్థులమైయున్నాము.

సిలువను గూర్చిన వార్తను మనము లోకమందంతట ప్రకటింపవలసియున్నది. పౌలు ఈ సువార్తను ప్రకటించుటకెన్నో శ్రమల ననుభవించాడు. అతడిట్లు చెప్పాడు: "నేను సిలువ వేయబడిన యేసు క్రీస్తును తప్ప మరి దేనిని మీ మధ్య నెరుగకుందునని నిశ్చయించుకొంటిని" (I కొరింథీ 2:2). "సిలువను గూర్చిన వార్త నశించుచున్న వారికి వెర్రితనముగాని రక్షింపబడుచున్న మనకు దేవుని శక్తి" (I కొరింథీ 1:18).

నమ్ము ప్రతివానిని రక్షించుటకు దేవుని శక్తియైయున్న సువార్తను ప్రకటించుట ఆయన శిష్యుని విధియైయున్నది (రోమా 1:16). మనము అనేక శ్రమలనుపొంది దేవుని రాజ్యములో ప్రవేశింపవలెను. నన్ను వెంబడించుమని ఆయన పిలుచుచున్నాడు (మత్తయి 9 : 9; యోహాను 21 : 22). శ్రమయైనను, బాధయైనను, కరవైనను హింసయైనను, ఖడ్గమైనను మరి ఏదైనను సరే దానిని క్రీస్తు కొరకు భరించి విశ్వాసములో ముందుకు పోవువాడే క్రీస్తు శిష్యుడు.

— **P.** ప్రకాశం, హైదరాబాదు.

# దాని విశ్వాస ప్రమాణము బైబిలు మాత్రమే

## *(It has the Bible as its only creed)*

## I పై విశ్వాసమునకు కారణములు

మానవకల్పిత విశ్వాస ప్రమాణము కలిగియున్న మత సంబంధమైన సంస్థలో నేనెన్నడు భాగస్థుడను కాలేను. అనేక కారణములను బట్టి అది నా విశ్వాసమై యున్నది. అవేవనగా:

1. అపొస్తలుల కాలములోను మరియు మొదటి మూడు శతాబ్దములలోను బైబిలు ఒక్కటి మాత్రమే విశ్వాస ప్రమాణమై యుండెను. అదే విశ్వాస ప్రమాణాన్ని ఈనాడెందుకు వినియోగించకూడదు? మొదటి శతాబ్దపు సంఘ నియమావళివలె యున్న దానిని నేను ఖాతరు చేయను. గాని ఆదిలో యున్నదానినే నేను కోరుదును. అది సాధ్యమవ్వాలంటే బైబిలు మాత్రమే యుండాలి.

2. ప్రతి సత్కార్యమునకు బైబిలు మనలను సంపూర్ణులుగా చేయును: "తన మహిమనుబట్టియు, గుణాతిశయమునుబట్టియు మనలను పిలిచినవాని గూర్చిన అనుభవజ్ఞాన మూలముగా ఆయన దైవశక్తి జీవమునకును భక్తికిని కావలసిన వాటినన్నిటిని మనకు దయచేయుచున్నాడు" (2 పేతురు 1:3). "దైవజనుడు సన్నద్ధుడై ప్రతి సత్కార్యమునకు పూర్ణముగా సిద్ధపడి యుండునట్లు, దైవావేశమువలన కలిగిన ప్రతి లేఖనము ఉపదేశించుటకును, ఖండించుటకును తప్పు దిద్దుటకును నీతియందు శిక్షచేయుటకును ప్రయోజనకరమై యున్నది" యని మన మెరుగుదుము (2 తిమో 3:16, 17). లేఖనములు మనకు ఉపదేశించడానికి, ఖండించడానికి, తప్పుదిద్దడానికి, నీతియందు శిక్ష చేయడానికి, ప్రతి సత్కార్యమునకు పూర్ణముగా సిద్ధపరుస్తాయని పరి

శుద్ధాత్ముడు చెప్పుచున్నాడు. మానవ ప్రమాణములుకూడ మా
వుని ప్రతి సత్కారమునకు సిద్ధపడి యుండునట్లు ఉపదేశించడాని
ఖండించడానికి, నీతియందు శిక్ష చేయడానికి ప్రయోజనకరమైన
కావా ? అవును. అట్లయితే దేవునిచే బైబిలు ఎందుకు ఇయ్యబడింది
అందుకే ఇయ్యబడిన మానవ విశ్వా ప్రమాణములకు భక్తి ఎందుకు
చూపాలి ? బైబిలు క్షేమకరమైనది. కాని మానవ ప్రమాణ పుస్త
కాలు క్షేమకరమైనవా ? వాటిననుసరించువారే అవి పొరబాటులేని
కావని అంగీకరిస్తారు. దేవునినుండి కలిగినట్టియు పొరపాటు పడనట్టియు
గ్రంథము మనకుండగ, మానవులనుండి కలిగినట్టియు పొరబాట్లతో
కూడినట్టివియునగు ప్రమాణపుస్తకాలకు ఎందుకు భక్తి చూపాలి? బైబి
లులో యున్న దానికి కలుపకుండా, దానినుండి తీసివేయకుండా, సంఘ
నాయకులు ఒక ప్రమాణపుస్తకాన్ని వ్రాస్తే అది బైబిలువలె కచ్చి
తంగా యుండును. కచ్చితంగా ఒకేలాగున్న రెండు గ్రంథాలు ఎందుకు
కలిగియుండాలి ? దానిలో యేమీ ప్రయోజనముండదు.

౩. బైబిలుగూర్చి మాత్రమే ఈ దిగువ సంగతులు చెప్ప
వచ్చును: "ఈ పురాతన గ్రంథములో దేవుని మనస్సు మానవుని
పరిస్థితి, రక్షణమార్గము, పాపులశిక్ష, విశ్వాసుల ఆనందము ఉన్నది.
దాని చరిత్రలు యదార్థము, దాని బోధలు పవిత్రములు, దాని నీతి
సూత్రములు బంధించునవి, దాని నిర్ణయములు మార్పులేనివి. జ్ఞాని
వగుటకు దానిని చదువు, క్షేమంగా యుండడానికి దాన్ని విశ్వసించు,
పరిశుద్ధుడుగా యుండుటకు దాన్ని ఆచరించు. దానిలో నిన్ను నడిపించ
డానికి వెలుగు, పోషించడానికి ఆహారము, సంతోషపెట్టడానికి సుఖము
న్నది. అది ప్రయాణికుని పటము, యాత్రికుని దండము, నావికుని
దిక్సూచి, సైనికుని ఖడ్గము, క్రైస్తవుని రాజశాసనము. ఇక్కడ పర
దైసు పునరుద్ధరించబడింది, పరలోకం తెరువబడింది, నరక ద్వారములు
బయలుపరచబడినవి. క్రీస్తు దాని అంశము, మన క్షేమమే దాని ఉద్దే

శము, మరియు దేవుని మహిమే దాని తుది లక్ష్యము. అది మన మేధస్సును నింపాలి, హృదయాన్ని పాలించాలి, పాదములను నడిపించాలి. దాన్ని నెమ్మదిగా, తరుచుగా, ప్రార్థనపూర్వకంగా చదువు. అది సంపదల గని, మహిమగల పరదైసు, ఆనందదాయకమైన నది. ఈ జీవితంలో అది నీకీయబడింది. తీర్పునాడు తెరువబడుతుంది, మరియు నిత్యము జ్ఞప్తిలో యుంచుకోబడుతుంది. అత్యంత ఉన్నతమైన బాధ్యత దానిలో యున్నది, గొప్ప కృషికి అది ప్రతిఫలమిచ్చుచున్నది. మరియు దాని పరిశుద్ధ సంగతుల నలక్ష్యము చేయువారినందరిని అది ఖండించుచున్నది" (Anon). ఏ మానవ కల్పిత ప్రమాణ పుస్తకము ఇట్లు చెప్పుకోలేదు. అట్టి ప్రమాణ పుస్తకాలు ఎంత అనవసరమో!

4. వాటి అసంపూర్ణతవలన మానవ ప్రమాణ పుస్తకములు ప్రతి కొన్ని సంవత్సరముల కొకసారి సరిచేయబడతాయి. మానవ ప్రమాణ పుస్తకాల ననుసరించువాడెవడు పది సంవత్సరాల తరువాత వాటి సిద్ధాంత మెట్లుండునో ఎరుగడు. పిల్లలు ఘోర దుష్టత్వముతో జన్మించుదురని బోధించే ఒక సంఘము కొన్ని సంవత్సరముల క్రితం నుండి పిల్లలు దుష్టత్వముతోను, దుర్మార్గతతోను, అవినీతితోను జన్మించుట లేదని బోధించుట మొదలిడింది. ఆ ప్రమాణ పుస్తకాన్ని బలపర్చిన సభ్యులు ముఖం మార్చుకోవాలని చెప్పబడింది. ఇదొక ఉదాహరణ. ప్రమాణ పుస్తకములు తరుచు మార్చబడుచున్నాయి, సరిజేయబడుచున్నాయి. ఇది ఒక్కటి మాత్రమే అవి బలహీనమైనవని, అసంపూర్ణమైనవని వాటిపై ముద్ర వేయుచున్నది.

మానవ ప్రమాణ పుస్తకములు పాతగిలిపోయి, క్రొత్త వాటి కొరకు విసర్జింపబడుచు యుంటే, బైబిలు జీవముగలదియై పనిచేయుచు యున్నది. దానికి మార్పు అనవసరం గనుక అది జీవించుచున్నది.

క్రీస్తు సువార్త పరిపూర్ణమై యున్నది. అది స్వాతంత్ర్యమిచ్చు సంపూర్ణ నియమమని పిలువబడింది (యాకోబు 1:25). అది సంపూర్ణమైనది. దానికి ఎవరైనా లేక ఏ గుంపైనా కలిపినా లేక దానినుండి తీసివేసినా వారిపై శాపము నిలిచియున్నది (గలతీ 1 : 6-9; ప్రకటన 22 : 18, 19). దేవుని వాక్యము పరిపూర్ణమైనది. దాన్ని మార్చడానికి ఏ మానవునికి ఆయన అనుమతి నియ్యలేదు. మోషే కాలములోనే ప్రభువు ఇట్లు చెప్పాడు : "నేను మీకాజ్ఞాపించిన మాటతో దేనిని కలుపకూడదు, దానిలోనుండి దేనిని తీసివేయ కూడదు" (ద్వితీ 4:2).

5. మానవ ప్రమాణపుస్తకముల తరపున మనము వాదింపలేము. బెంజమిన్ ఫ్రాంక్లిన్ ఇట్లు చెప్పాడు :

"మొదటిగా, బైబిలుకంటె ఎక్కువ కలిగియున్న ప్రమాణపుస్తక మేదైనను అభ్యంతరకరమైనది, ఏలయనగా బైబిలుకంటె ఎక్కువ దానిలో యున్నది.

రెండవదిగా, బైబిలుకంటె తక్కువ కలిగియున్న ప్రమాణపుస్తక మేదైనను అభ్యంతరకరమైనది, ఏలయనగా బైబిలుకంటె తక్కువ దానిలో యున్నది.

మూడవదిగా, బైబిలుకు భిన్నముగాయున్న ప్రమాణపుస్తక మేదైనను అభ్యంతరకరమైనది, ఏలయనగా అది బైబిలుకు భిన్నముగా యున్నది.

నాలుగవదిగా, కచ్చితముగా బైబిలువలెయున్న ప్రమాణపుస్తక మేదైనను అభ్యంతరకరమైనది. ఏలయనగా మనకు బైబిలు ఉన్నది.

యిది అంతటినీ సమీక్షించుచున్నది. యిక వేరే తలంపేమీ లేదు. ప్రమాణ పుస్తక మేదైనను బైబిలుకంటె ఎక్కువ లేక తక్కువ కలిగియుంటూవుంటె, దానినుండి వేరుగ యుంటాది లేదా కచ్చితంగా

దానిలాగే యుంటాది. ఏ మానవుడు తన ప్రమాణ పుస్తకము బైబిలుకంటె ఎక్కువైనదనిగాని, తక్కువైనదని లేక దానినుండి వేరైనదని లేక దానివలెనే యున్నదని చెప్పి దాని పక్షమున వాదించలేడు. ఈ కారణాల చొప్పున ప్రమాణ పుస్తకములను కాయలేకపోతే, మరి యే కారణములనుబట్టి అది కాపాడబడగలదు! మర్త్యుడైన మానవుడు ఊహించదగిన కారణములు నిజంగా ఇంకేమీ లేవు".

6. మానవ లిఖిత ప్రమాణపుస్తకముల యెడల తమ భక్తిని ప్రకటించినవారు బైబిలు పక్షమున వాదించలేరు. దేవుని వాక్యము యొక్క సంపూర్ణత, పరిపూర్ణతను గూర్చి వారు చెప్పే ప్రతిమాట, వారు గైకొన్న స్థానములనుబట్టి నిరర్థకము చేయబడుచున్నది. వారు వారి క్రియలవలన వారి విశ్వాసాన్ని నిరూపించుకోలేక పోవుచున్నారు (యాకోబు 2:18). నిజానికి వారి క్రియలద్వారా దానిలో వారికి విశ్వాసము లేకపోయినట్లు చూపించుచున్నారు. మానవుడు బైబిలును, బైబిలునుమాత్రమే తన విశ్వాసప్రమాణముగా అంగీకరించనియెడల, దానిని నిర్దేవుని యెదుట విజయవంతముగా రక్షించలేడు. బైబిలుకు వేరేగాయున్న గ్రంథముచొప్పున ఒకనిబోధ నడిపింపబడుచున్నప్పుడు, బైబిలు బోధలను ఆ బోధకుడు పరిరక్షించుట అసంభవము. దానిలో అతనికిగల విశ్వాస లేమికి, గ్రహణశక్తి లేమికి ఈ అసంగత్వమొక ఋజువైయున్నది. నిర్దేవుడిట్లు చెబుతాడు: "బోధకుడా, బైబిలు నిజమైతే, బైబిలుకు వేరేగాయున్న ప్రమాణపుస్తకాన్ని ఎందుకు కలిగియున్నావో మాకు వివరించు. నీవు వాదించురీతిగా ప్రతి సత్కార్యమునకు పూర్ణముగా సిద్ధపడి యుండడానికి అది ఉపదేశించుటకు ఖండించుటకు తప్పుదిద్దుటకు నీతియందు శిక్షచేయుటకు ప్రయోజనకరమైతే, మానవకల్పిత ప్రమాణపుస్తకాల ప్రయోజనం యేమిటో నిరూపించు". ఇట్టి సందర్భంలో ప్రమాణపుస్తకాలకు కట్టుబడియున్న బోధకుని తడబాటును, ఇబ్బందిని నీవాలోచించుకోవచ్చును.

స్కాట్ లేండ్ దేశస్థుడైన రోబర్ట్ డేల్ ఆవెన్ నాస్తికులలో గొలియాతువంటివాడు అమెరికా దేశము వచ్చి వంద సంవత్సరములకు పైగా గడచిపోయింది. పూర్వకాలంలో ఫిలిష్తీయుల గొలియాతు చేసిందే అతడు చేసాడు: అతడు దేవుని ప్రజలను ఎదిరించాడు; బైబిలు యథార్థతనుగూర్చి అతనితో వాక్పోరాటము జరిపించు నిమిత్తము క్రీస్తు అనుచరులొకరిని పంపాలని కోరాడు. అతడు చేసిన సవాలును వినగానే ప్రమాణపుస్తకాలకు బంధింపబడియున్న మతశాఖల ప్రజలు వణికారు. ఎందువలన? వారి పరిస్థితి ఏమాత్రము రక్షణీయము కానిదని వారెరుగుదురు. బైబిలుకు బదులు వారి ప్రమాణపుస్తకాల ప్రయోజనాన్ని నిరూపించుమని ఆవెన్ వారి నడుగుతాడని వారికి తెలుసు; బైబిలులో చెప్పబడని పేర్లు వారెందుకు ధరించారో అతడు వివరించమంటాడు, బైబిలులో కనబడని సంఘములలో వారెందుకు సభ్యులైయున్నారో అతడు వర్ణించమంటాడని వారికి తెలుసు. వారు గజగజలాడారు! అయితే అతని సవాలు నెదుర్కొనడానికి ఒక దావీదు లేచాడు. అతడు క్రైస్తవుడు మాత్రమే, క్రీస్తుసంఘసభ్యుడు మాత్రమే, బైబిలు తప్ప అతనికింకొక ప్రమాణపుస్తకం లేదు. సత్యము కొరకైన యుద్ధము ఏప్రిల్ 13, 1829న సిన్‌సినేటి పట్టణంలో ఆరంభమై ఎనిమిది దినములమట్టుకు కొనసాగింది. నాస్తికత్వపు గొలియాతగు ఆవెన్ తన అభిమాన ఆయుధాన్ని అనగా, బైబిలును నమ్ముచున్నామని చెప్పుకొనుచు దానికి భిన్నముగాయున్న ప్రజలయొక్క అసంగతాన్ని వినియోగించలేకపోయాడు. అతని ప్రతివాది ఏ డినామినేషన్ సంఘ సభ్యుడు కాదు, మానవకల్పిత నామాన్నిగాని, మానవలిఖిత ప్రమాణపుస్తకాన్నిగాని కలిగియుండలేదు. నాస్తికుడు పతనమయ్యాడు. అది బైబిలుకొక గొప్ప విజయం మరియు క్రైస్తవప్రజలు ఉత్సాహంతో ఉప్పొంగారు. ఈ విశ్వాస రక్షకభటుడు అలెగ్జాండర్ కేంబెల్. తామున్నస్థితి రక్షణీయము కాకపోతే అనేకమంది బోధకులు అదే సంగతిని చేయగల్గుదురు. ఆత్మావేశములేని మానవులచే వ్రాయబడిన ప్రమాణముల మెడల భక్తికలిగి యున్నప్పుడు మానవులు బైబిలును కాపాడలేరు.

7. మానవ విశ్వాస ప్రమాణములు విభజిస్తాయి. భక్తిగల ప్రజలను అవి పార్టీలుగను, గుంపులుగను విభజిస్తాయి. ప్రతి విశ్వాస ప్రమాణము దాని ననుసరించువారిని లోపల యుంచుటకును మిగతా వారినందరినీ వెలుపల యుంచుటకును ఒక గోడవలె పనిచేస్తాది. ఐక్యత సాధించాలంటే ఈ గోడలు పడిపోవాలి, కూలిపోవాలి. అవన్నీ తప్పక నాశనమవ్వాలి. మతశాఖల వారంతా తమ ప్రమాణపుస్తకాలను విసర్జించి, మా శాఖయొక్క విశ్వాసప్రమాణాన్ని అంగీకరించాలని ఏ ఒక్క మతశాఖ కోరకూడదు. మానవ లిఖిత ప్రమాణాన్ని అనుసరించ వలసివస్తే వారు తమకున్నదాన్నే ఎంచుకొంటారు. మానవకల్పిత విశ్వాస ప్రమాణములు ఎత్తివేయబడినప్పుడు, మతశాఖల అడ్డు బల హీనమౌతాయి, మరియు విభజింపబడిన ప్రజలు ఏకమయ్యే మార్గంలో పయనిస్తారు.

---

## ప్రేమ గలిగి నీనాలుకను అదుపులో యుంచు కొనుము
## *(Let Love control your Tongue)*

పౌలు ఎఫెసులోని సహోదరులకు వ్రాస్తూ "ప్రేమగలిగి సత్యము చెప్పుచు క్రీస్తువలె ఉండుటకు మనమన్ని విషయములలో ఎదుగుదము" అని చెప్పాడు (ఎఫెసీ 4:15). క్రీస్తులో ఎదగాలంటే మనం సత్యాన్ని చెప్పాలి. సత్యము మనకు బలమైన పునాదివలె పనిచేయును. అటు యిటు కొట్టుకొని పోయే మానవాభిప్రాయాల కంటే అది ఎంతో మిన్న (ఎఫెసీ 4:14).

మన నాలుకలు సత్యాన్ని పట్టుకొనడమే గాకుండా, సత్యం మన నాలుకలను పట్టుకోవాలి. ప్రభువు శరీరమందలి అవయవములైన మనము, చెడ్డవాటిని చెప్పకుండా మన నాలుకలకు బైబిలునే కళ్ళెము వేయనియ్యాలి. సత్యదేవుని యెడల మనకున్న ప్రేమవలనను, సత్యం

అవుసరమై యున్నవారి యెడల ప్రేమ చూపుటకు మనకున్న ఆసక్తి వలనను ఇది జరగాలి.

"నిర్మలమైన మనస్సాక్షి కలిగినవారై మీలో ఉన్న నిరీక్షణను గూర్చి మిమ్మును హేతువు అడుగు ప్రతివానికిని సాత్వికముతోను భయముతోను సమాధానము చెప్పుటకు ఎల్లప్పుడు సిద్ధముగా ఉండి, మీ హృదయములయందు క్రీస్తును ప్రభువుగా ప్రతిష్ఠించుడి" యని అపొ. పేతురు చెప్పాడు (1 పేతురు 3:15). ప్రతి క్రైస్తవుని హృదయం దేవునికి ప్రతిష్ఠింపబడిన స్థలమై యుండాలి. దేవుడు మన హృదయముల నేలువాడు గనుక మన నిత్య విశ్రాంతి స్థలమగు పరలోకం కొరకు మనము నిరీక్షించుచున్నాము. ఆ నిరీక్షణను గూర్చి ఇతరులు మనలను ప్రశ్నించినపుడు నిష్కపటమైన హృదయంతో, దేవునియందలి భయంతో వారికి జవాబీయాలి. ప్రశ్నించినవాని ఆత్మయందలి ప్రేమనుబట్టి మన నాలుకను **అదుపులో** యుంచుకోవాలి.

"ఒకడు బోధించిన యెడల దైవోక్తులను బోధించునట్టు బోధింపవలెనని" పేతురు హెచ్చరించాడు. "ఇందువలన దేవుడు అన్నిటిలోను యేసుక్రీస్తు ద్వారా మహిమ పరచబడును" (1 పేతురు 4:11). మనం దైవోక్తులను బోధించినప్పుడు సత్యము మనల్ని యేసువైపు చూపిస్తాది. మరియు ఆయనయందు పాపము నుండి స్వతంత్రులనుగా చేస్తాది (యోహాను 5:39; 8:32).

సత్యము, ప్రేమవలన సహోదరుల యెడల మన నాలుక అదుపులో యుంచబడాలి. ఎవనిని దూషింపవలదని తీతు 3:2లో పౌలు చెప్పాడు. (ఫిలిప్పీ 4:8 కూడ చదువండి). ఇతరులను గూర్చిన దుష్ట తలంపులతో నిండియుండుటవలన క్రైస్తవుడు తనకు తానే తప్పులో అడుగు వేస్తాడు. క్రీస్తు బోధించిన కొన్ని సత్యాలను అపవాది బాగా నేర్చుకొన్నాడు. మత్తయి 12:25లో యేసు ఇల్లు బోధించాడు;

"తనకు తానే విరోధముగా వేరుపడిన ప్రతి రాజ్యము పాడై పోవును. తనకు తానే విరోధముగా వేరుపడిన ఏ పట్టణమైనను ఏ యిల్లయినను నిలువదు". సహోదరులు ఒకరిమీద ఒకరు దురభిప్రాయములను వెల్లగక్కుటవలన సంఘాన్ని పాడు చేయుటకు అపవాదికి సహాయము చేయుచున్న వారగుదురు.

ఈ లోకంలో యున్న ప్రతి జంతువును మానవుడు సాధు చేయగలడు గాని "ఏ నరుడును నాలుకను సాధు చేయనేరడు. అది మరణకరమైన విషముతో నిండినది, అది నిరర్గళమైన దుష్టత్వమే" (యాకోబు 3:8). నాలుక యొక్క దుష్టత్వాన్ని ఎరిగినవాడై దేవుడు దానిని కటకటాల (పళ్ళ) వెనుక యుంచాడని ఒకాయన చెప్పాడు. మరింత ఎక్కువ మేలు చేయుటలో సహోదరులను ప్రోత్సాహించుటకు మాత్రమే కటకటాలనుండి నాలుకను విడుదల చేయుటకు మనం నిశ్చయించు కొందము గాక.

క్రైస్తవ జీవితమొక పందెము వంటిదని హెబ్రీ పత్రిక లేఖకుడు వర్ణించాడు (హెబ్రీ 12:1, 2). ఈ పందెమును కలిసి పరుగెత్తాలని, బలహీనతలను జయించి ఒకరికొకరు సహాయపడాలనేది మనం తెలిసికోవాలని అతడు కోరాడు (హెబ్రీ 12:12-13). తరువాత అతడిట్లన్నాడు: "అందరితో సమాధానమును పరిశుద్ధతయు కలిగి యుండుటకు ప్రయత్నించుడి. పరిశుద్ధత లేకుండ ఎవడును ప్రభువును చూడడు. మీలో ఎవడైనను దేవునికృపను పొందకుండ తప్పిపోవునేమో అనియు, చేదైన వేరు ఏదైనను మొలిచి కలవర పరచుట వలన అనేకులు అపవిత్రులై పోవుదురేమో అనియు జాగ్రత్తగా చూచుకొనుడి" (హెబ్రీ 12:14, 15). సహోదసులు ఒండొరులను గూర్చి విమర్శించుచు, పుకార్లు పుట్టించుచుండుట వలన అందరు కలసి పరుగెత్తే పందెములో అభ్యంతరాలు రాకమానవు.

గనుక మనం సత్యాన్ని ప్రకటించుట మాత్రమే గాక, సత్యాన్ని బట్టి మన నాలుకను అదుపులో పెట్టుకొందము. క్రైస్తవు కానివానిని దేవుడు తట్టును, క్రైస్తవుడైన వానిని పరలోకము తట్టును, సూచించే సంగతులను మాత్రమే ప్రేమతో పలుకుటకు ఈ నూతన సంవత్సరములో నిశ్చయించుకొందము! !

— గేరీ హౌస్టన్

---

సంక్షిప్త ప్రసంగము :

## ఈ నా డు (*Today*)
## హెబ్రీ 13:8

**పరిచయము :**

1. నిన్న యేమి జరిగినదో, లేదా రేపేమి జరుగనై యున్నదో దానిని గూర్చిన ఆసక్తి కాదు, గాని ఈ రోజును గూర్చిన ఆసక్తి.
2. ఈ రోజేమి చేసామో దానిపై రేపు ఆధారపడి యుంటాది.
3. లేఖనములు ఈ యంశమును గూర్చి యేమి చెప్పుచున్నవో గమనించుదాం.

**I సువార్తను ఈ రోజే వినుము: హెబ్రీ 3:7-9.**

1. మనము దేవుని కుమారుని మాటలను వినాలని దేవుడు చెప్పాడు (మత్తయి 17:5).
2. విశ్వాసం కలుగు నిమిత్తం ఒకడు సత్యాన్ని వినాలి (రోమా 10:17).

**II దేవునికి ఈవాడే లోబడుము : 2 కొరింథీ 6:2.**

1. నీకు సమయమును తరుణము ఉండగానే సువార్తకు లోబడుము (మార్కు 16:16).

2. నపుంసకునివలె తక్షణమే సువార్తకు లోబడుము (అపొ.కా. 8:26-39).

III ఇతరులను ఈవాడే హెచ్చరించుము : హెబ్రీ 3:12, 13.

1. నశించిపోకుండు నిమిత్తం దీనిని చేయాలి (2 తిమో 4:2).
2. ఇతరులు రక్షింపబడు నిమిత్తం దీనిని చేయాలి (1 తిమో 4:16).

IV క్రైస్తవుడు ఈవాడే పనిచేయాలి : మత్తయి 21:28.

1. ప్రభువు కార్యాభివృద్ధి యందు ఎల్లప్పుడు ఆసక్తులై యుండాలి (1 కొరి 15:5).
2. సొంత రక్షణను కొనసాగించు నిమిత్తం కృషి చేయాలి (ఫిలిప్పీ 2:12).

V ఈ వాటివి గూర్చి అతిశయపడవద్దు : యాకోబు 4:13, 14.

1. ఈ జీవితం త్వరలో అంతమౌతాది (హెబ్రీ 9:27).
2. వెడలిపోడానికి ఎల్లప్పుడు సిద్ధంగా యుండాలి (ప్రకటన 2:10).

VI క్రీస్తు నేడు కూడ ఒకేలాగున్నాడు : హెబ్రీ 13:8

1. ఆయన ఇప్పుడు కూడ మార్గము సత్యము జీవమై యున్నాడు (యోహా 14:6).
2. ఆయన ఇంకా ప్రజలను ఆహ్వానించుచున్నాడు (మత్త 11:28-30).

ముగింపు :

1. మిత్రులారా, ప్రార్థించడానికి, పఠించడానికి, ప్రేమించడానికి, సహాయం చేయడానికి, పవిత్రమైన భక్తికలిగి యుండడానికి మనకున్నదంతా ఈ రోజు మాత్రమే.

౨. ఈ రోజు త్వరలోనే అంతమైపోతాది. అది మరెన్నడు తిరిగి రాదు. గనుక త్వరపడవలసింది ఈరోజే.

౩. ఈనాడు నీవు ఏమి చేయుదువో, దానిని బట్టి నీవు నిత్యత్వము నెక్కడ గడుపుదువో ఆధారపడి యుంటాది.

— జె. సి. ఫోట

---

ఆమె నారి యనబడును - 7

## స్త్రీలు – ఆరాధన

## *(The Woman and Worship)*

పెద్ద పట్టణాల్లో ప్రయాణించడం ఒక సమస్యగా యున్నప్పుడు సాధారణంగా పురుషులే ఆరాధనకు వెళ్ళి, స్త్రీలను పిల్లలను యింటివద్ద విడిచిపెట్టడం జరుగుతూ యుంటాది. ఆత్మీయ విషయాలను గ్రహించుకొనడానికి పిల్లలు చాలచిన్నవారని, వారిని సిటీబస్సులోను, రిక్షాలలోను ఎక్కించి దింపడం ఒక శ్రమ అని తలుస్తారు. గనుక వారిని ఇంటి దగ్గర విడిచి పెడతారు. అంటే వారితో తల్లికూడ ఇంటివద్దనే యుంటాది.

ఈ యలవాటు వలన కలిగే ఫలితమేమిటి? భర్త ఒక్కడు మాత్రమే ఆరాధనకు వెళ్లుటవలన బలమైన క్రైస్తవ కుటుంబాలు తయారవుతాయా! బైబిలు సత్యాలను కుటుంబము దీనినుండి నేర్చుకోగలదా! ఈ విధంగా వారు సంఘకృషిలో పాల్గొనగలరా? మిగత క్రైస్తవులను వారు చూడడమే అరుదవుతాది గనుక వారి యెడల ప్రేమానురాగములను, సన్నిహితాన్ని పెంపొందించుకోగలరా!

భర్త ఒక్కడు మాత్రమే (లేక భార్య ఒకతే మాత్రమే) ఆరాధనకు వెళ్లుటవలన చివరకు అతడు (లేక ఆమె) ఆత్మీయంగా బ

హీనపడే అవకాశమున్నదని, సత్యము నుండి తొలగిపోయే ప్రమాద మున్నదని మనము గమనించాలి. ఈ తరమువారును రాబోవు తరము వారును బలమైన క్రైస్తవులుగా యుండాలంటే ఒకేఒక్క మార్గము న్నది. క్రైస్తవ కుటుంబాన్నంతటిని ఆరాధనలోను, సంఘ కృషి లోను పాల్గొనేలా చూడడమే ఆ మార్గము. మన కుటుంబాలకు ఆత్మీయ శిక్షణ క్రమంగా ఇయ్యకపోతే నశించిపోతాయి, వారియెడల ఈ ప్రమాదాన్ని మనం గమనించి దానినుండి వారిని కాపాడాలి.

స్త్రీ కూడ ఆత్మను కలిగి యున్నది. దేవుని నారాధించాలని ఆమెకు కూడ తెలుసు. దేవుని వాక్యమునుండి ఆమె ప్రోత్సాహకర మైన పాఠములను, నడిపింపుకు తగిన పాఠములను వినవలసిన అవుసరత ఆమెకున్నది. సంఘములో యున్న ఇతరులను ఆమె ప్రేమించాలి. క్రీస్తునందున్న సోదరీలతో ఆమె సన్నిహిత సంబంధం కలిగియుండి ఆమె సంతోషంలోను, విచారములోను వారు పాల్గొనాలి. వారి సంతోషం లోను, విచారంలోను ఈమె పాల్గొనాలి. దేవునియెడల చేయు కృషిని బట్టి ఆమె కూడ ఆత్మీయముగా పెరుగునట్లు సంఘాభివృద్ధిలో తోడ్పడు పనిని ఆమె కనుగొనాలి.

ఆత్మీయ సంగతులను పెద్దల స్థాయిలో పిల్లలు గ్రహించుకో లేకపోవచ్చును గాని, పిల్లల స్థాయిలో వారికి బోధింపబడినప్పుడు వారా సంగతులను తప్పక గ్రహించుకో గలుగుదురు. అందువలననే తలిదండ్రులు ఎంత శ్రమయైనను పిల్లలను ఆరాధనకు తప్పక తీసికొని వెళ్ళాలి, మరియు దేవుని సత్యాలను గ్రహించుకొంటూ సంపూర్ణ మైన జ్ఞానాభివృద్ధి పొందు నిమిత్తం వారికి ఆదివారపు బడిలో బోధించాలి.

స్త్రీలు, పిల్లలు క్రమంగా ఆరాధనకు వెళ్లుట మాత్రమే గాక, ప్రతిదినం యింటిలో కుటుంబారాధన, బైబిలు పఠనం జరిపించుట

అత్యవసరం. ఆదివారపు ఆరాధన సమయంలో వారం అంతా సరిపడ ఆత్మీయాహారాన్నంతటిని పొందలేము. మనము తరుచు ప్రార్థించాలి, యింటివద్ద పఠించాలి. ఈ రీతిగా మాత్రమే కుటుంబమంతా ఆత్మీయంగా బలపడతాది.

ఈ లోకంలో యున్నదంతా సాధించి మన ఆత్మలను పోగొట్టుకొంటే మనకు కలిగిన లాభం శూన్యం. మన బిడ్డలు ఆత్మీయంగా నాశనమైపోతే ఈ లోకంలో వారికియ్యడానికి మనం చేసిన కృషి అంతా నిష్ఫలం. గనుక మనం సరియైన సంగతులను ముందు ఎంచుకోవాలి. "ఒక మనుష్యుడు లోకమంతయు సంపాదించుకొని త ప్రాణమును పోగొట్టుకొంటే అతనికేమి ప్రయోజనము?" (మత్తయి 16:26).★

— బెట్టీ ఫో

---

## సంఘము ఎవరిది?

### *(To Whom Does the Church belong?)*

1. సంఘాన్ని నిర్మించినవాడు క్రీస్తు. మత్త 16:18
2. సంఘాన్ని క్రీస్తు తన సొంత రక్తంతో కొన్నాడు. అపో.కా. 20:28
3. సంఘానికి పునాది క్రీస్తే. 1 కొరింథి 3:11
4. సంఘములోనికి ద్వారము క్రీస్తే. యోహాను 10:9
5. సంఘము క్రీస్తుయొక్క పెండ్లి కుమార్తె. ప్రకట 21:9
6. సంఘమునకు శిరస్సు క్రీస్తే. ఎఫెసీ 5:22, 23
7. సంఘము ఆయన శరీరము. ఎఫె 1:22, 23

పైన చెప్పుకొన్న వాస్తవాలను బట్టి సంఘము ఎవరిది! అది ఎవరి పేరు ధరించాలి? అదెవరి సంఘమో ప్రభువుకు తెలుసు. అందుకే "క్రీస్తు సంఘములు" అని ఆయన వాక్యం చెబుతున్నది (రోమా 16:16).

క్రీస్తు సంఘములచే నిర్వహించబడుచున్న

# బైబిలు వాక్యోపదేశ కూటములకు

హాజరవుటకు మీకు మా ఆహ్వానం!

స్థలం: కిన్నెర ఆడిటోరియం

హోటల్ అప్సర, వాల్తేరు మెయిన్‌రోడ్

విశాఖపట్టణం - 530 002

సమయం: 1986 జనవరి 23, 24, 25 తేదీలలో

ప్రతిరోజు: ఉదయం 10-00 గంటల నుండి 12-00 వరకు

మధ్యాహ్నం 3-00 నుండి 5-00 వరకు

సాయం 6-30 నుండి 8-00 వరకు.

పురుషులు స్త్రీలు, క్రీస్తుసంఘముల సభ్యులు, బోధకులు, నాయకులు అందరికీ స్వాగతం. నమ్మకమైన సువార్త బోధకులచే గొప్ప బైబిలు అంశములు ఉపదేశించబడును.

రండి, మీ మిత్రులనుకూడ తీసికొని రండి!!

This is Your INVITATION to Attend

# BIBLE LECTURESHIP

*Sponsored by Churches of Christ*

Place: KINNERA Auditorium

in

Hotel APSARA
Waltair Main Road,
**Visakapatnam - 530 002.**

**Dates: 1986 January 23, 24 & 25**

Everyday: 10.00 a.m. to 12.00 Noon
3.00 p.m. to 5.00 p.m. and
6.30 p.m. to 8.00 p.m.

Men and Women, Members, Preachers and Leaders of the Church are Welcome. Great Bible themes by Faithful Gospel Preachers will be Presented!

PLEASE COME AND BRING
YOUR FRIENDS!!

# నీ చేతిలో సహజంగా కనబడేది ఏది ?

## ( What Looks Natural in your hands ? )

ఒక స్త్రీ చనిపోగా సమాధి పెట్టెలో యుంచినప్పుడామె చేతు లలో తెరువబడియున్న బైబిలు నుంచాలని ఆమె భర్త కోరాడు. బైబిలు ఆమె చేతులలోయుంటే ఆమె సహజంగా కనబడతాదని అతడు చెప్పాడు. అట్లు కనబడడానికి ఆమె జీవించిన జీవితం ఎటువంటిదో యని నేను చాల ఆలోచించాను. ఆమెను గూర్చి నేను చదివిన వ్యాస మునుబట్టి 58 సంవత్సరముల మట్టుకు వారు వివాహితులని, వారికి పదుగురు బిడ్డలు, 15 మంది మనుమలు, 11 మంది మునిమనుమ లున్నారని గ్రహించాను. వారిలో బాధ్యతా యుక్తవయస్సు వచ్చిన వారందరు క్రైస్తవులయ్యారు. బైబిలును చదివే వారి జీవిత ప్రభావ ము యొక్క నిదర్శనం అది కాదా ? తన అంతిమ క్రియలవద్ద ఎవరు పుష్పముల నర్పించరాదని, వాటికయ్యే డబ్బును బీదల కియ్యాలని చనిపోకముందు ఆమె కోరింది.

నీవు చనిపోయినప్పుడు నీ చేతిలో సహజంగా కనబడేదాన్ని ఏదైనా పెడితే ఎట్లుంటాది? అదేమయ్యుంటాది? ఒక సారా బోటలా? సిగరెట్టా? పేకలా? రూపాయి నోట్లా? నవలా? బైబిలా? అదేమయ్యుం టాది? ఇది నిజంగా ఆలోచించదగిన సంగతి. నీ జీవితాన్ని సరిగ్గా వర్ణించే వస్తువును దేనిని నీ చేతిలో యుంచడానికి నీ కుటుంబము ఎంచు కొంటాది? నీ చేతిలో సహజంగా కనబడేది యేమిటి? ★

—డేవిడ్ సెయిన్.

# ఇది నిజం !

## (It is a Fact)

ఒక చెట్టులో బోలెడన్ని ఆకులున్న కొమ్మ నొక దానిని నరికి ఒకచోట దాన్ని జాగ్రత్తగా యుంచి గమనించు! నెమ్మదిగా దాని రంగు కోల్పోతాది, ఆకులు వాడిపోయి ముడుచుకుపోతాయి. అది ఎండిపోయి చస్తాది.

చెరువులోనుంచి చేపనొకదాన్ని బయటకు తీసి దానిని యిసుక మీద జాగ్రత్తగా పెట్టి, గమనించు! గజిబిజిగా కొంతసేపు అది కొట్టుకొంటాది. క్రమంగా బలహీనమౌతాది, చివరకు చస్తాది.

సంఘ సభ్యుని సంగతికూడ అంతే. దేవునినుండి, ఆరాధననుండి, సహవాసమునుండి, ప్రార్థననుండి, సంఘ కృషినుండి అతన్ని క్రమంగా వేరుచేసి చూడు! ప్రభువురాత్రి భోజనంలో పాల్గొన లేకపోయేకొలదీ అతని అంతరాత్మ కొంత కొట్టుకొంటాది. కొంత కాలానికి ప్రశ్నించ దగిన పనులలో అతడు తల దూర్చుతాడు. సంఘంలో అందరు వేషధారులే ఉన్నారంటాడు. చివరిగా క్రైస్తవ జీవితానికి వ్యతిరేకుడై నిలబడతాడు, ఆత్మీయంగా మరణిస్తాడు. ఇది నిజం !!

యేసు ఇట్లు చెప్పాడు : "నాయందు నిలిచియుండుడి; మీయందు నేనును నిలిచియుందును నాయందు నిలిచియుంటేనే కాని మీరును ఫలింపరు...ఎవడు నాయందు నిలిచియుండునో నేను ఎవనియందు నిలిచియుందునో వాడు బహుగా ఫలించును; నాకు వేరుగా ఉండి మీరేమియు చేయలేరు. ఎవడైనను నాయందు నిలిచియుండని యెడల వాడు తీగవలె బయట పారవేయబడి యెండిపోవును; మనుష్యులు అట్టివాటిని పోగుచేసి అగ్నిలో పారవేతురు; అవి కాలిపోవును" (యోహాను 15:4-6).

★

---

Regd. No. H/KD—45/KD.H.O.

*From*
**SATYA WAKKU**
P.O. Box. 80
KAKINADA-533 001

No.

To
..............................
..............................
..............................
..............................